# ఇన్లాండ్ లెటర్ కథలు

## చెప్పేదొకటి చేసేదొకటి



అబ్బబ్బ ఈ విషయం విన్నారా "కట్నం తేలేదని భార్యను కిరసనాయులు పోసి తగల బెట్టిన భర్త" పేపర్‌లో వచ్చిన వార్తను చూస్తూ బస్టాండులో వున్న నిరుద్యోగి అయిన రమేష్ పక్కన వున్న ఆయనతో అన్నాడు.

"ఛీ లోకం చెడిపోయిందండీ,కంటికి రెప్పలా చూసుకోవాల్సిన భార్యను పాడు కట్నం కోసం నిర్దాక్షిణ్యంగా తగల బెట్టడం మరీ అన్యాయమండీ" పక్కనున్న ఆయన ఏమీ మాట్లాడక పోవడంతో మళ్ళీ తనే అన్నాడు రమేష్.

" అవునండీ నిజంగా అన్యాయమే" రమేష్‌ను బాగా పరిశీలిస్తూ అన్నాడు పక్కనున్నాయన.

"అసలు నన్నడిగితే ఈ వరకట్నాలను నిషేధించాలండీ. సారా పై ఉద్యమించిన మహిళలు ఈ వరకట్న సమస్యపై పిడికిలి బిగించాలి" తన మాటలు పక్కనున్న అతను వింటుండటంతో రమేష్ విజృంభించాడు." నేనుపెళ్లి చేసుకుంటే కానీ కట్నం లేకుండా పేద పిల్లను చేసుకుంటాను- " అని చెప్పసాగాడు. ఇంతలో బస్సు రావటంతో ఎక్కివెళ్లిపోయాడు.

కొన్నాళ్లకు రమేష్‌కు ఉద్యోగం వచ్చింది. మంచి జీతం కూడా వస్తోంది. ఆ రోజు రమేష్ పెళ్లి చూపులకు వెళ్ళాడు. అమ్మాయిని చూసి "నచ్చింది అన్నాడు. "బాబూ... ఖర్చులు పోను ఒక లక్ష ఇచ్చుకోగలను"అని అమ్మాయి తండ్రి చెప్పాడు.

అందుకు రమేష్ స్పందిస్తూ " నేను గవర్నమెంటు ఉద్యోగిని కనీసం ఓ మూడు లక్షలు ఇస్తేనే ఈ పెళ్లి జరిగేది" అని ఖరా ఖండీగా నొక్కి చెప్పాడు.

"ఏమిటి బాబూ...ఆ రోజు బస్టాండులో వరకట్నాలపై పెద్ద ఉపన్యాసమిచ్చావు. మరి ఇప్పుడు నీవుచేస్తున్నదేమిటి ఇప్పుడు మూడు లక్షలు అడిగావు,పెళ్లి తర్వాత మరో రెండులక్షలు కావాలంటావు,చివరికి కిరసనాయులు పోసి తగల బెడతావు.అందుకే నా కూతుర్ని నీ కిచ్చి కాటికి పంపలేను, ఇక దయచేయి" అని అమ్మాయి తండ్రి అనడంతో ఒక్కసారిగా రమేష్ బిత్తరపోయి ఆయనను పరిశీలనగా చూశాడు. అప్పుడు గమనించాడు.ఆ రోజు తాను బస్టాండులో మాట్లాడింది ఈయనతోనే అని. అంతే.రమేష్ మొఖంలో నెత్తురు చుక్క ఉండే ఒట్టు.

ఇందిర, అనంతపూర్.

## పందెం

ఆ రోజు కాలేజీ ఫంక్షన్ జరుగుతోంది. అందరూ గుంపులుగా నిల్చొని మాట్లాడుకుంటున్నారు. ఇంతలో వారి మాటలకు భంగం కలిగిస్తూ ఒక టయోటా కారువారి ముందు ఆగింది. వారంది చూపులూ ఒక్కసారిగా కారు మీదకి మళ్లాయి.డోర్ తీసుకొని సుతారంగా దిగింది కాలేజీ బ్యూటీ...సుమ.



"హాయ్, ఏమిటే ఈ రోజు విశేషాలు? అన్నట్టు ఈ రోజు ఏదైనా పందెం ఉందా?" అంది తన పక్కనే ఉన్న స్నేహితురాళ్లతో సుమ.

"ఈ రోజు పందెం ఏమిటంటే మన కాలేజీ ఫస్టు వచ్చిన విజయ్‌ని నువ్వు ప్రేమలోకి దించాలి." అన్నారామె స్నేహితురాళ్లు. సరే నేను గెలిస్తే మీరందరూ నాకు 500 రూపాయలు ఇవ్వాలి. లేదా మీ అందరికీ నేను 1000 రూపాయలిస్తాను." అంది గర్వంతో సుమ.

మర్నాడు కాలేజీలో విజయ్ తన మోటర్ బైక్ స్టాండ్ వేస్తుండగా సుమ హఠాత్తుగా వచ్చి " హాయ్ విజయ్, ఎలా వున్నావు."అని పలకరించింది. ఎప్పుడూ మాట్లాడని సుమ హఠాత్తుగా వచ్చి పలకరించే సరికి ఆశ్చర్య పోయాడు విజయ్. అలా వారి పరిచయం ప్రేమలోకి దారితీసింది. మొత్తానికి సుమ విజయ్‌ని ప్రేమలోకి దించింది.

అన్నమాట ప్రకారం సుమ స్నేహితురాళ్ళు ఆమెకు పార్టీ ఇవ్వదానికి హోటల్ కళింగకు వెళ్లారు.

"ఇప్పుడేమంటారు ఫ్రెండ్స్.నేనే గెలిచాను.మనం అనుకున్నట్టుగా విజయ్‌ని నేను ప్రేమలోకి దించాను. పందెం గెలిచాను"అంది సుమ తన స్నేహితురాళ్ళతో.

ఇంతలో పక్కరూములో నుంచి విజయ్ గొంతు వినిపిస్తే అందరూ నిశ్శబ్దంగా ఉండి ఆ మాటలు వినసాగారు.

"శభాష్ రా విజయ్. మొత్తానికి సుమచే ప్రేమించబడతానని మాతో 1000 రూపాయలు పందెం కాసి గెలిచావు. ఇంతకీ ఇదెలా సాధించావు? " అంటున్నారు విజయ్ స్నేహితులు.

"ఏముందిరా వెరీ సింపుల్. ఆ రోజు అనుకోకుండా తన స్నేహితులతో సుమ అంటున్న మాటలన్నీ విన్నాను. ఆమెకు బుద్ధి చెప్పడానికే ఆమెను ప్రేమించినట్లు నటించాను. మీతో పందెం కాసి గెలిచాను. ఇంతే అన్నాడు విజయ్.

ఆ మాటలు విన్న సుమ, ఆమె స్నేహితురాళ్ళు తెల్ల మొఖం వేశారు.

ఎమ్.ఎస్.శేఖర్,భోపాల్.